# ప్రత్యక్ష పరిచయం

"కనకలింగేశ్వరీదేవిగారి ఇల్లు ఇదేనాండి?" అని అడుగుతూ ఓరవాకిలిగా వేసిన తలుపులు నెట్టాడు. జవాబుకొరకు ఎదురుచూస్తూ చేతిలో ఉన్న సూటు కేసును మెట్టుమీదనే ఉంచి మరొకసారి తలుపుదగ్గర నిలబడి లోపలికి తొంగి చూశాడా యువకుడు.

"మగవాళ్లు ఇంట్లో లేరండీ! ఇంకో గంటకుగాని రారు" అంటూ లోప ల్నించి వచ్చింది ఇంటావిడ.

"ఆఁహాఁ! అట్లాగా! అయితే ఇది కనకలింగేశ్వరీదేవిగారి ఇల్లేనా" తిరిగి ప్రశ్నించాడా యువకుడు.

"నా పేరు కనకమ్మ అంటారు. మీ రన్న పేరుగలవాళ్లు ఈ వీధిలో ఎవరూ లేరే!" అన్నదావిడ పైటచెంగుతో పెదవులను అద్దుకుంటూ.

అతడు ముందుకు రాబోవటముచూసి కనకమ్మ వెనుకడుగు వేసింది. కోటు జేబులోకి చెయ్యి పోనిస్తూ అన్నాడు. "ఈ ఇల్లే అయిఉండాలి. నేను పొరబడ లేదనుకుంటాను."

కనకమ్మ గోడకానుకుని నిలబడి చూస్తూ అతడిని కూర్చోమని కుర్చీ చూపిం చింది. పుట్టింటివారు చూసిరమ్మని పంపిచారేమో ఒకవేళ - లేకపోతే తనపేరే ముందుగా ఎందుకు ఎత్తుతాడు? అనుకున్నది. ఎంతసేపు జ్ఞాపకము చేసుకున్నా అతడిని అదివరలో చూసినట్టు గుర్తుకు రాలేదు.

"నేను మీ దర్శనము చేసుకుంటామని వచ్చాను" అన్నాడు తానే సంభాష ణకు ఆరంభము చేస్తూ అతడు.

"మీరు ఎక్కడినుంచి వస్తున్నారు?" అన్నది మామూలుగా కనకమ్మ. ఏ సిఫారసుకో వచ్చి ఉంటాడని అనుమానించింది. "అయినా తనవారు చెప్పిపంపిన

సమాచారమంతా గబగబ చెప్పడే''మని ఆమె అనుకునే అంతలో అతడే అందు కున్నాడు.

"నేను తెనాలిలో ఉంటానులెండి. నేను కవిత్వము నేర్చిన వాడిని కాను. రసాస్వాదకుడను. ఇటీవల వెలువడిన గ్రంథాలన్నీ చదివిన వాడిని. నాకు నేటి సాహిత్యములో అభిరుచి ఎక్కువ. మీ గ్రంథము అచ్చయినదని విన్నాను. వినట మేమిటీ - దాని సమీక్ష పత్రికలు ప్రకటించినంతవరకూ చదివాను. ఆ గ్రంథము చదవాలన్న ఆశకొద్దీ నేనే వ్రాసి ఒక ప్రతిని తెప్పించుకున్నాను. కోరిన వెంటనే మీరు ఒక కాంప్లిమెంటరీ కాపీకూడా పంపారు." అన్నాడు ఆమె ముఖములోకి చూస్తూ.

అతడు ఏ విషయాన్ని గురించి మాట్లాడుతున్నాడో ఆమెకు అర్థము కాలేదు. అతడు ఎవరికోసమో వచ్చాడు-తనను చూసి పొరబడ్డాడనుకున్నది కనకమ్మ.

ముఖము చేతిరుమాలుతో తుడుచుకుంటూ అతడు తిరిగి ప్రారంభించాడు "గ్రంథము చక్కగా ముద్రించారు. చాలా ఆకర్షణీయంగా ఉన్నది. నేనా పుస్త కాన్ని ఎన్నిమార్లు చదివానో చెప్పలేను అన్ని కథలూ ప్రత్యేకంగా ఎన్నతగినవే. ముఖ్యంగా ఆ చివరికథ నాకు చాలా నచ్చింది. అన్నిటిలోకి అది కొలికి పూసలా ఉన్నది. ఆ సన్నివేశాలు చాలా సహజంగా రమ్యంగా ఉన్నాయి."

కనకమ్మ గారెలపిండి రుబ్బుతూ వచ్చింది. కాఫీ నీళ్లు పొయ్యిమీద మరిగి పోతున్నాయి. తనకు ఎంత మాత్రమూ అర్థము కాని సోది ఎంతసేపు వింటూ కూర్చుంటుంది? వేళకు కాఫీ ఫలాహారము అందకపోతే కనుబొమలు ముడివేసే పెనిమిటి ఈ పాటికి వస్తూ ఉంటాడు ఇంటికి.

"వారు వచ్చే వేళయింది కూర్చోండి" అంటూ లోపలికి వెళ్లబోయింది కనకమ్మ. "వివరాలన్నీ ఆయనే అడుగుతాడు-తన కెందుకా గొడవ? లేని పోనిది!" అనుకుని.

వెంటనే అతడూ లేచినిలబడ్డాడు. "ఏంలేదండీ! మీ గ్రంథము చదివి నేను ఎంత ఆనందించానో ఇప్పుడు చెప్పలేను. నిజంగా స్త్రీలలో ఇటువంటి కథలు వ్రాసినవారు తక్కువ. నా సంతోషాన్ని స్వయంగా తెలుపుకుందామని ఇంతదూరము వచ్చాను. మీ కథలమీద నేనొక చక్కని సమీక్షకూడా వ్రాశాను..........."

అతడింకా మాటపూర్తి చేయకముందే ఇద్దరు లాల్చీ తొడుక్కున్న కనకమ్మ పెనిమిటి లోపలికి వచ్చాడు; వస్తూనే అతడి ముఖము చూసి నిలబడి పోయాడు.

పెనిమిటి రాగనే కనకమ్మ తన మీది బరువు దిగిపోయి నట్టుగా లోపలికి వెళ్లిపోయింది.

అతడు ఆమె పుట్టింటివారి వైపు చుట్టమేమోననుకుంటూ లోపలికి వెళ్లి చెప్పులు విడిచి కాళ్లుకడుక్కొని వస్తూ కనకమ్మ పెనిమిటి వంటయింట్లోకి తొంగి చూశాడు. కనకమ్మ తలవంచుకొని గారెలు చేస్తున్నది. శేషాచలపతి మాట్లాడకుండా వాకిటి గదిలోకి వచ్చి అతడి కెదురుగుండా కుర్చీలో కూర్చున్నాడు

ఆ యువకుడికి ఈ దంపతుల వైఖరి చాలా నిరాశ కలిగించింది. ముఖ్యంగా ఆమె ఈ విధంగా ఉంటుందని అతడు ఊహించనైనా లేదు. ఆ వ్రాతలు ఆమె కట్టూ బొట్టూ తీరులో కాక పోయినా మాటల్లోనయినా ప్రతిబింబిస్తాయని అతడు ఆశించాడు.

తన యింటికి వచ్చిన మనిషిని పలకరించకుండా కూర్చోవటము అమర్యాదగా తోచి శేషాచలపతి "మన దేవూరండీ" అన్నాడు.

"మాది అమలాపురము తాలూకాలెండి. కనకలింగేశ్వరీ దేవిగారు ఇటీవల రచించిన గ్రంథాన్ని చదివాను. అది నాకు చాలా నచ్చింది. చక్కని ముద్రణ. నా అభినందనాలు సమర్పిద్దామని వచ్చాను." అన్నాడు మెల్లగా - తనకు కలిగిన ఆశాభంగాన్ని పైకి కనబడనీయకుండా.

"అయితే మీరు ఆ గ్రంథాన్ని చదివారన్నమాట! మీరన్న మాటే చాలా మంది అన్నారు. ఇప్పుడు వెతికి చూద్దామన్నా ఒక్క కాపీ లేకుండా పోయింది" అన్నాడు శేషాచలపతి సంతోషముతో.

"అవును! ఆ సంపుటిలో ఉన్న కథలన్నీ చాలా ఆకర్షణీయముగానూ మనోరంజకముగానూ ఉన్నాయి మరి! ముఖ్యంగా ఆఖరుది నా మనసు చూరగొన్నది."

"నా ఉద్దేశ్యములో కూడా ఆ కథే గొప్పదని! నా మిత్రులు చాలామంది నాతో ఏకీభవించారు"-అంటూ శేషాచలపతి ఆత్మానందాన్ని వెళ్ళగక్కాడు!

"ఆ కథలో స్త్రీ హృదయము బాగా వ్యక్తము చేయబడ్డది. స్త్రీ తప్ప స్త్రీ హృదయాన్ని మరెవరూ ఆ విధంగా చిత్రించలేరు. పురుషుడు ఎంత అనుభవముతో వ్రాసినా ఊహామాత్రముగానే ఉంటుంది ఆ చివరికథ ఉన్నదే - అదికొన్ని ఆంగ్లకథలతో పోటీచేయదగినది"-అన్నాడు ఉత్సాహముకొద్దీ యువకుడు

ఈ మాటలకు శేషాచలపతి మనసు ఆనందముతో గంతులు వేసింది. ఆ కథకులంత విలువ కట్టినందుకు కృతజ్ఞతను వెల్లడించకుండా ఉండలేక పోయినాడు. కాని అకస్మాత్తుగా మనసుకు చురక తగిలినట్లయింది. అవమానకరమనిపించింది; ముఖము కందగడ్డలా ఎర్రబడ్డది. వెంటనే లేచి నిలువబడి "ఆ కథలు వ్రాసింది నేనయ్యా నేను:" అని గుండెమీద చేత్తో కొట్టుకున్నాడు.

ఆ యువకుడి సంశయము తొలగిపోయింది. వెంటనే ముఖములో రంగు మారిపోయింది. తలగోక్కుంటూ పెదవి విరిచాడు

ఈ సంగతి గమనించ కుండానే శేషాచలపతి "మిత్రులు కొందరు ఆ కథ ముగింపు మీద చాల సలహాలిచ్చారు. నాకు మాత్రము ఆ ముగింపే కథను రాణింప చేసిందనీ ఏ మాత్రము మార్చినా పెంపో చెడిపోతుందనీ ఉద్దేశ్యము: మీరుకూడా నాతో ఏకీభవిస్తారా?" అన్నాడు.

ఆ యువకుడికి ఆ కథలను గురించి ఇంక మాట్లాడాలని లేదు. వాటిమీద కలిగిన అభిమానము కాస్తా కరిగిపోయింది "ముగింపు కేమిలెండి ఎట్లాముగించినా ముగిసిపోతుంది. అయినా ఆ కథను మరోసారి చదివితే ఆ ప్రత్యేకత ఏమీకనబడదు ఆ ముగింపు ప్రకృతివిరుద్ధంగా కూడా కనబడక మానదు రచయిత తాను చెప్పదలచుకున్నదంతా ముఖ్యపాత్రచేత అనిపించి నందువల్ల మరీ వెగటుగా ఉన్నది" అంటూ లేచాడు

శేషాచలపతికి అతడి ధోరణి అర్థము కాలేదు. "అప్పుడే లేస్తున్నారేం? కూర్చోండి. ఆవిషయాన్ని చర్చిద్దాము. మీ సలహాలను గురించి ఆలోచిద్దాము. రెండవ ముద్రణ వేయించాలను కుంటున్నాను" అన్నాడు.

"ఈ భాగ్యానికి అందరి సలహాలూ ఎందుకూ?" అంటూ ఆ యువకుడు బయలు దేరాడు శేషాచలపతి వంక చూడకుండా

"ఇంత దూరము ఎందుకు వచ్చినట్లు? ఇంత తొందరగా ఎందుకు వెళ్లినట్లు?" గోఉక్కుంటూ శేషాచలపతి వంటయింట్లోకి వెళ్లి పీటమీద కూర్చున్నాడు గారెలపళ్లెం ముందర.